

పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

# స్పీకర్‌కు ఘన స్వాగతం

- వికారాబాద్‌కు వచ్చిన గడ్డం ప్రసాద్‌కుమార్
- పోలీసుల గౌరవ వందనం స్వీకరణ

వికారాబాద్, డిసెంబర్ 17 : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా వికారాబాద్‌కు వచ్చిన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని అతిథి గృహానికి వచ్చిన ఆయనకు పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికారాబాద్ నియోజకవర్గ, జిల్లాకు చెందిన పలు విషయాలను కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీవో విజయకుమారి, ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్పీకర్ రాకను తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలివచ్చి వచ్చి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్పీకర్‌ను కలిసిన వారిలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్‌కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా దానకిశోర్

- మొదటిసారి ఒక సంస్థకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు
- హెచ్‌ఎండీఏ పరిధిలో అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మహానగర విస్తరణ అంతా హెచ్‌ఎండీఏ పరిధిలోనే..

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణలో హెచ్‌ఎండీఏ ఎంతో కీలకం. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన నుంచి మొదలుకొని వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులు, కొత్త లే అవుట్లు, భారీ బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతులు, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం... అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్, ఔటర్ రింగు రోడ్డు... ఇలా ఎన్నో రకాల కార్యకలాపాలు చేపడుతున్న హెచ్‌ఎండీఏపై కొత్త ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిని సారించింది. ఇప్పటివరకు హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా, పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి 2019 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అలాంటి స్థానంలో కొత్త ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి స్థాయి కలిగిన ఐఏఎస్ అధికారిని హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా దానకిశోర్‌ను నియమించగా.. రెండు రోజుల కిందట కార్యదర్శి స్థాయి అధికారిణి అయిన ఆమ్రపాలిని హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా నియమించింది. నాలుగు ఏండ్లుగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి స్థానంలో ఒకేసారి ఇద్దరిని నియమించడం ద్వారా ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు స్పష్టమవుతున్నది. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కంటే హెచ్‌ఎండీఏ పరిధిలోనే భవిష్యత్ అభివృద్ధికి ఎక్కువ అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే నగర శివారు ప్రాంతాల్లో పట్టణీకరణతో పాటు మెరుగైన మౌలిక వసతుల కల్పన విషయంలో సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు సమర్థవంతమైన అధికార యంత్రాన్ని నియమించినట్లు తెలుస్తోంది.

## భవిష్యత్‌లో రీజినల్ రింగు రోడ్డు...

గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు తరహాలోనే 7 జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏ పరిధి చుట్టూ ప్రాంతీయ వలయ రహదారి(రీజినల్ రింగు రోడ్డు–ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణ ప్రతిపాదనలు పురోగతిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డుల మధ్య ఉన్న ప్రాంతాల్లో పట్టణీకరణ ఎలా ఉండాలన్న దానిపై ప్రత్యేక అధ్యయనం చేయనున్నారు.

## జలమండలి ఎండీగా సుదర్శన్‌రెడ్డి

జలమండలి ఎండీగా సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన బదిలీల్లో భాగంగా 2002 బ్యాచ్‌కు చెందిన సి. సుదర్శన్‌రెడ్డిని ఎంఏయూడీ సెక్రటరీ నుంచి జలమండలికి బదిలీ చేసింది. జలమండలిలో సుదీర్ఘ కాలంపాటు పనిచేసిన ఎండీ దానకిశోర్‌ను పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది.

## రానున్న రోజుల్లో మరింత పైపైకి..

రానున్న రోజుల్లో సన్న బియ్యం ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. రైతులు విక్రయించిన సన్న రకాల ధాన్యాన్ని మిల్లర్లు స్టాక్ చేసి పెట్టుకున్నారు. దీంతో ధరలు వ్యాపారుల నియంత్రణలోనే ఉం డనున్నాయి. బియ్యం అమ్మకాలన్నీ ఇప్పుడు బ్రాండ్‌పైనే సాగుతున్నాయి. రైతులు పండించే ధాన్యాన్ని మిల్లింగ్ చేసి రకరకాల పేర్లతో మా ర్కెట్లో విక్రయిస్తున్నారు. కొందరు పెద్ద మిల్లర్లు రైతుల నుంచి సన్నాలు కొని మిల్లింగ్ చేశాక బ్రాం డ్లు ముద్రించి ప్రైవేట్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. సన్న బియ్యం స్టాక్ అంతా వ్యాపారుల గుప్పిట్లోనే ఉండడంతో వచ్చే రోజుల్లో బియ్యం ధరలు మరింతగా పెరుగనున్నాయి. జిల్లాలో సన్నాల సాగు తగ్గడం..మిగ్‌జాం తుఫాన్‌తో వరి పంటలు దెబ్బతినడం ఒక కారణమైతే వ్యాపారులు బియ్యాన్ని బయటి రాష్ట్రాలకు తరలించడం మరో కారణమని పలువురు పేర్కొంటున్నారు.



- క్వింటాలుకు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు పెరుగుదల
- ఆందోళనకు గురవుతున్న సామాన్యులు
- బ్లాక్ మార్కెట్ వల్లే ఈ దుస్థితి !
- మున్ముందు మరింతగా పెరిగే అవకాశం
- ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లావాసుల విజ్ఞప్తి

# బియ్యం.. పిరమాయె..

రంగారెడ్డి, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. వారంలోనే క్వింటాల్‌పై రూ.700 నుంచి రూ.1000 వరకు పెరుగడం సామాన్యులను ఆందోళనకు గురి చేస్తున్నది. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశం ఉండడం ప్రజానీకంలో గుబులు పుట్టిస్తున్నది. మార్కెట్‌లో డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని బియ్యాన్ని బ్లాక్ చేస్తూ వ్యాపారులు పెద్ద ఎత్తున దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం ధరలను సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

## పెరిగిన ధరలతో బెంబేలెత్తుతున్న ప్రజలు..

ఇక్కడ పండించిన సన్నాలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తుండడం, మిల్లర్లు, దళారులు నేరుగా రైతుల వద్ద సన్న వడ్లను కొని బియ్యంగా మార్చి నిల్వ చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని బియ్యం వ్యాపారులు ఇష్టారీతిన ధరలు పెంచుతున్నారన్న విమర్శలున్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో వివిధ రకాలకు చెందిన పాత బియ్యం రూ.6,400 వరకు ధర పలుకుతుండగా.. కొత్త బియ్యం క్వింటాలుకు రూ.5,400 వరకు ఉన్నది. గతేడాది పాత బియ్యం ధర రూ.4,400 నుంచి రూ.4,800 వరకు ఉండగా.. ప్రస్తుతం ధర రూ.వెయ్యి వరకు పెరిగింది. మునుపెన్నడూ లేని విధంగా ధరలు పెరుగడంతో సామాన్యులు బియ్యం కొనలేని పరిస్థితి నెలకొంది. ఇక నిరుపేదలు కడుపునిండా తినలేక పస్తులుండే దుస్థితి తలెత్తింది. సన్న వడ్లకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండడంతో రైతుల్లో మాత్రం హర్షం వ్యక్తమవుతున్నది.

### పెరిగిన ధరలు ఇలా..

| క్వింటాల్‌కు | గతేడాది | ప్రస్తుతం |
|---|---|---|
| బీపీటీ(కొత్తవి) | రూ.4,000 | రూ.4,600 |
| బీపీటీ(పాతవి) | రూ.4,600 | రూ.5,200 |
| జైశ్రీరాం(కొత్తవి) | రూ.4,400 | రూ.4,800 |
| జైశ్రీరాం(పాతవి) | రూ.5,600 | రూ.6,800 |
| హెచ్‌ఎంటీ | రూ.4,600 | రూ.5,600 |
| బాస్మతి | రూ.9,000 | రూ.12,000 |
| సోనా మసూరి | రూ.5,600 | రూ.6,200 |





### ధరలను అదుపు చేయాలి

సామాన్యుడు సన్న బియ్యం కొనలేని విధంగా ధరలు అమాంతంగా పెరిగాయి. గత 20 రోజుల కిందట సన్న బియ్యం క్వింటాల్‌కు రూ.5వేలు ఉంటే ఇప్పుడు రూ. ఆరు నుంచి రూ. ఏడు వేలకు పెరుగడంతో సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం సన్నబియ్యం ధరలను అదుపు చేస్తేనే సామాన్యులకు మేలు.

**-ఇమ్రాన్ , సింగప్ప గూడ గ్రామం, చేవెళ్ల, మండలం**




# సైబర్ మోసాలపై వాకథాన్

శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కర్ణాటక బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఆదివారం వాకథాన్ నిర్వహించారు. సైబర్ మోసాలు, సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కర్ణాటక బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కేఎల్. శేషాద్రి, మజాజ్ అలియాంజ్, అధికారి అనిల్ ప్రారంభించారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద నిర్వహించిన వాకథాన్‌లో కేఎల్. శేషాద్రి కర్ణాటక బ్యాంకు అందించే సేవలను ప్రజలకు వివరించారు.

**-సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ)**